క్లుప్తంగా

వీల్ చైర్ అందజేత



రామకృష్ణకు వీల్ చైర్ అందజేస్తున్న ముజీబ్‌ఖాన్, రామయ్య తదితరులు

దాబాగార్డెన్స్: సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా అలయన్స్ క్లబ్ (నార్త్) విశాఖ శాఖ ప్రతినిధులు ఆదివారం రెండు కాళ్లు కోల్పోయి మంచాన పడిన ఓ వ్యక్తికి వీల్ చైర్ అందజేశారు. విజయనగరం జిల్లా గుర్ల మండలం కెల్ల గ్రామానికి చెందిన అంబల్ల రామకృష్ణ రెండు కాళ్లు కోల్పోయి గత పదిహేనేళ్లుగా మంచాన పడిన విషయం తెలుసుకుని అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ సభ్యులు విశాఖ నుంచి విజయనగరం జిల్లా గుర్ల మండలం కెల్ల గ్రామానికి వెళ్లి రామకృష్ణకు వీల్ చైర్ అందజేశారు. క్లబ్ విశాఖ శాఖ అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్, రామయ్య సహకారంతో ఉచితంగా మందులు అందజేసి, సేవా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి ఇమంది ఈశ్వరరావు, సభ్యుడు వీరభద్రరావు, రామకృష్ణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


గురుద్వారాలో సీపీ బాగ్చి ప్రత్యేక ప్రార్థనలు



సింథియా గురుద్వారా దర్బార్‌లో చిన్నారులకు ప్రసాదం అందిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

మల్కాపురం: పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదివారం ఉదయం సింథియా న్యూకాలనీలోని సిక్కుల ఆరాధ్య దైవం గురునానక్ మందిరమైన గురుద్వారా దర్బార్‌ను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మత పెద్దల ఘన స్వాగతాన్ని అందుకున్నారు. మందిరంలో సిక్కులతో కలిసి పవిత్ర ప్రార్థనలు చేశారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా దర్బార్‌లో భక్తులకు సీపీ శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులతో కాసేపు ముచ్చటించి, వారికి చాక్లెట్లు, ప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మైనారిటీల సంరక్షణకు ప్రభుత్వం, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ముందుంటాయన్నారు. స్థానికంగా ఏ సమస్య వచ్చినా తక్షణం 79950 95799 నంబర్‌లో తనను సంప్రదించాలన్నారు. అనంతరం సిక్కు మత పెద్దలు సీపీ బాగ్చిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సిక్కు మతస్తులు, మల్కాపురం పోలీస్ స్టేషన్ సీఐ గొలగాని అప్పారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ర్యాలీ



ఆరిలోవ కాలనీలో ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష నేతలు

ఆరిలోవ : కూటమి ప్రభుత్వం ఇళ్లకు అమర్చుతున్న అదానీ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఆరిలోవలో వామపక్ష ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ ఆరిలోవ ఆఖరి బస్టాప్ నుంచి దుర్గాబజార్ మీదుగా టి.ఐ.సి.పాయింట్, అంబేడ్కర్ కూడలి వరకు సాగింది. అదానీ స్మార్ట్ మీటర్లు మాకొద్దు.., ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని నినాదాలు చేస్తూ ర్యాలీ చేస్తూ ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తూ పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని ఆయా ప్రతినిధులు డిమాండ్ చేశారు. విద్యుత్ సమస్యలపై ఈ నెల 5న గురుద్వార సమీపంలోని ఏపీ ఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద చేపట్టనున్న ధర్నాలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐద్వా, మహిళా సమైక్య నాయకులు పాల్గొన్నారు.

అలరించిన వినోదాల విందు

తాటిచెట్లపాలెం: ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ నెలవారీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన వినోదాల విందు అలరించింది. ఎం.వి.సుబ్రహ్మణ్యం, జబర్దస్త్ ప్రకాష్, డేవిడ్‌రాజ్, కుమారి, పుష్పమ రాగస్ నాయుడు, నరసింహారావు, సూర్య, ఎస్ఎస్ నాయుడు, పోర్ట్ శేషు లఘు నాటికలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. శేఖర్ కుమార్ అందించిన హాస్య గుళికలు వినోదాన్ని పంచాయి. కార్యక్రమంలో తిలక్ పట్నాయక్, సన్ మూర్తి, బి.మాల్యాద్రి, రిటైర్డ్ డీజీఎం డాక్టర్ మీగడ శోభిభూషణ, స్వామి తదతరులు పాల్గొన్నారు.

అయ్యో రామా.. ఇదేం ఖర్మ!



నిర్మాణంలో ఉన్న దిడ్డి జగన్నాయకులు కల్యాణ మండపం

- కల్యాణ మండపంలో గొర్రెల పెంపకం
- అసాంఘిక కార్యకలాపాల జోరు
- రెచ్చిపోతున్న మందుబాబులు
- వైఎస్సార్‌సీపీ హయాంలో మొదలై ఎన్నికల సమయంలో ఆగిపోయిన నిర్మాణం
- అటు తర్వాత పట్టించుకోని కూటమి ప్రభుత్వం



కల్యాణ మండపంలో పెంచుతున్న గొర్రెపోతులు

అల్లిపురం: జీవీఎంసీ 34వ వార్డులో దిడ్డి జగన్నాయకులు కల్యాణ మండపాన్ని రూ. 99 లక్షలతో పునర్నిర్మిస్తున్నారు. 2024 ఎన్నికల సమయంలో ఎన్నికల నిర్వహణ నిమిత్తం ఇక్కడ తాత్కాలిక నిర్మాణాలు చేపట్టారు. ఎన్నికల అనంతరం ఆ నిర్మాణాలను అలాగే వదిలేయడంతో పాటు.. కల్యాణ మండప నిర్మాణ పనులు కూడా అటకెక్కాయి. దీంతో కల్యాణ మండపం కొంత మందికి వరంగా మారింది. వారు గొర్రెల పెంపకానికి అనువుగా మార్చుకున్నారు. కల్యాణ మండపం ఆవరణలో గొర్రెలు కట్టుకుని వాటిని మేపుకుంటున్నారు. అసాంఘిక కార్యకలాపాలకూ నెలవుగా మారింది. తక్షణమే కల్యాణ మండపం నిర్మాణం పూర్తి చేసి వార్డు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కార్పొరేటర్ తోట పద్మావతితో పాటు వార్డు ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

2019లో ఏర్పాటు..

32,33,34 వార్డులతో పాటు 35వ వార్డు ప్రజలకు దిడ్డి జగన్నాయకులు కల్యాణ మండపం అనువుగా ఉండేది. ఇది జీర్ణావస్థకు చేరటంతో 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో పునర్నిర్మాణంతో పాటు కల్యాణ మండపం స్థలంలో వార్డు ప్రజల అవసరాల నిమిత్తం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మించారు. మిగిలిన సగభాగంలో ఏప్రిల్ 2023లో రూ.49 లక్షల అంచనాతో కల్యాణ మండపానికి అప్పటి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శంకుస్థాపన చేశారు. పనులు మొదలు పెట్టిన తర్వాత మరో రూ.49 లక్షలు అదనంగా కేటాయించారు. ఈ సమయంలో సార్వత్రిక ఎన్నికలు రావటంతో కల్యాణ మండపంలో తాత్కాలిక కట్టడాలు నిర్మించి ఎన్నికలు నిర్వహించారు. తర్వాత వాటిని అలానే వదిలేశారు. దీంతో ఇది అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయింది.

అక్రమార్కులకు అడ్డాగా..

కల్యాణ మండపంలో నిర్మించిన తాత్కాలిక కట్టడాలు అక్రమార్కులకు అడ్డాగా మారిపోయాయి. మందుబాబులకు వీలుగా తయారయ్యాయి. గత ఏడాది ఒక యువతిపై అత్యాచారం జరగటంతో టూటౌన్ పోలీసులు చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం కొంత మంది గొర్రెలు పెంచుతుండడంతో పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. దీంతో స్థానికులు తక్షణమే తాత్కాలిక నిర్మాణాలు తొలగించి కల్యాణ మండపం పూర్తి చేయాలని కోరుతున్నారు.



కల్యాణ మండపంలో తాగి పడేసిన బీరు బాటిళ్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ తోట పద్మావతి



కల్యాణ మండపం ఆవరణలో కట్టి ఉన్న గొర్రెలను పరిశీలిస్తున్న పద్మావతి

కౌన్సిల్‌లో పెట్టినా చర్యలు శూన్యం

కల్యాణ మండపం నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని మేయర్‌తో పాటు కలక్టర్‌కు వినతిపత్రం అందజేశాను. జీవీఎంసీ కౌన్సిల్ మీటింగ్‌లలో కూడా వివరించాం. ఈ ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఫిర్యాదు చేశాం. కానీ ఇంత వరకు చర్యలు తీసుకోలేదు. మళ్లీ కౌన్సిల్‌లో పెట్టి పరిష్కారానికి కృషి చేస్తాను.

– తోట పద్మావతి, 34వ వార్డు కార్పొరేటర్

అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి

అసంపూర్తిగా నిర్మించిన కల్యాణ మండపంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. పోలీసులు నిరంతరం నిఘా పెట్టాలి. తగిన చర్యలు తీసుకోవాలి. తక్షణమే తాత్కాలిక నిర్మాణాలు తొలగించి కల్యాణ మండపం నిర్మాణం పూర్తి చేసి ప్రజల అందుబాటులోకి తీసుకురావాలి.

– వాసుపల్లి దానయ్య, కొబ్బరితోట

కల్యాణ మండపం లేక ఇబ్బందులు

వార్డులో ఎలాంటి కార్యక్రమాలు చేసుకోవాలన్నా ఇబ్బందులు ఎదుర్కోనాల్సి వస్తుంది. వార్డు దాటి వెళ్లాలంటే దూరమవుతుంది. గతంలో కల్యాణ మండపం అందుబాటులో ఉండేది. కొత్తది నిర్మిస్తామని తొలగించారు. మూడేళ్లయినా పనులు పూర్తి కాలేదు. త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలి.

– వై.అప్పారావు, నేతాజీనగర్

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం: కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ. 10, రూ. 50 కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్, ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

ఈశ్వరరావుకు సత్కారం



ఈశ్వరరావును సత్కరిస్తున్న మహదేవ అప్పారావు తదితరులు

మహారాణిపేట: కలెక్టరేట్ పరిపాలన అధికారి (ఏవో)గా రిటైర్ అయిన కేవీ ఈశ్వరరావును రైల్వే కార్మిక సంఘం నాయకుడు మహదేవ అప్పారావు ఆదివారం ఘనంగా సన్మానించారు. విశాలక్షినగర్‌లో ఈ కార్యక్రమం జరిగింది. గతనెల 31న ఈశ్వరరావు రిటైర్ అయ్యారు.

అపూర్వ సమ్మేళనంలో సందడే సందడి



స్నేహితుల దినోత్సవం సందర్భంగా కలుసుకున్న రైల్వే హైస్కూల్ 1987-88 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు

అల్లిపురం: వారంతా ఎప్పుడో కలిసి చదువుకుని 47 ఏళ్ల వయసులో నెరిసిన జుట్టుతో కలుసుకున్నారు. వారిలో కొందరు అవ్వాతాతలు కూడా అయ్యారు. మరికొందరు పిల్లల పెళ్లిళ్లు కూడా చేసేశారు. బతుకుబండిలో ఏం సాధించామని ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే అన్నీ బరువులు, బాధ్యతలే కనిపించాయి వారికి. కుటుంబ పోషణ, సంసార సాగరం, ఉద్యోగ బాధ్యత, వ్యాపార లావాదేవీలు ఇలా ఎన్నో ఆటుపోట్ల నడుమ నలిగిపోతున్న జీవితం. వీటన్నింటినీ కాసేపు పక్కన పెట్టి స్నేహితుల సాన్నిహిత్యంలో గడిపితే లభించే ప్రశాంతతే వేరు. చిన్నప్పుడు కలిసి చదువుకున్న స్నేహితులందరూ ఒక్కొక్కరూ ఒక్కో ఊరు, రాష్ట్రం, దేశాల్లో జీవనం సాగిస్తున్న రోజులు ఉన్నాయి. ఇలాంటి పూర్వ విద్యార్థులందరూ ఆత్మీయ సమ్మేళనాల పేరిట కలుసుకొని స్నేహ బాంధవ్యాలను నిలుపుకుంటున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని ఆహ్లాదంగా గడుపుతున్నారు. ఎక్కడెక్కడి నుంచో వచ్చి ఒకేచోట కలుసుకొని 'అరేయ్', 'ఒరేయ్', 'ఏరా'అంటూ చిన్నప్పుడు పిలుచుకునే ఊత పేర్లతో పిలుచుకుంటూ ఆనందంగా గడుపుతున్నారు. నగరంలోని రైల్వే వైర్లెస్ కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1987–88లో పదవ తరగతి చదివిన స్నేహితుల బృందం ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఒక హోటల్‌లో ఆదివారం ఘనంగా స్నేహితుల దినోత్సవం జరుపుకున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి సుమారు 50 మంది పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తమ ఆధ్వర్యంలో జరిగిన సామాజిక సేవా కార్యక్రమాలు సమీక్షించి భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించారు. అవసరంలో ఉన్న స్నేహితులకు ఆర్థిక సహాయం అందజేసే సంకల్పం కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో బసవ శ్రీనివాస్, చామన విశ్వేశ్వరరావు, రవీంద్రనాథ్ పట్నాయక్, కె. గౌరీ శంకర్, ఆలూరి సంజీవికుమారి, భమిడిపాటి భవానీ, ఎల్. కల్యాణీ, నసీమా బేగం తదితరులు సారథ్యం వహించారు. ఆట పాటలు సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

వేడుకగా స్నేహితుల దినోత్సవం



వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న 31వ వార్డు అధ్యక్షుడు బాపూ ఆనంద్ తదితరులు



ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టుకుంటున్న చిన్నారులు



స్వామి వివేకానంద సంస్థలో స్నేహితుల దినోత్సవ దృశ్యం

దాబాగార్డెన్స్: నియోజకవర్గ పరిధిలో ఆదివారం స్నేహితుల దినోత్సవం వేడుకగా జరుపుకున్నారు. ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కేక్ కట్ చేసి తినిపించుకున్నారు. స్నేహితుల దినోత్సవం ప్రత్యేకత చాటుకున్నారు.

స్వామి వివేకానంద సంస్థలో..

పాతనగరంలోని స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో స్నేహితుల దినోత్సవం, యోగా శిక్షణ తరగతులు నెల రోజులు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. యోగా మాస్టార్ గణేష్ నేతృత్వంలో యోగా శిక్షణ తరగతులు, భగవద్గీత శ్లోకాల అధ్యయనం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ద్రోణంరాజు శ్రీవత్సవ్ యోగా మాస్టార్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ, నెల రోజులుగా ప్రతి ఆదివారం శ్రద్ధతో యోగాసనాలు నేర్చుకుంటున్న విద్యార్థులను అభినందించారు. వారికి భగవద్గీత పుస్తకాలు అందజేశారు. అనంతరం స్నేహితుల దినోత్సవంలో భాగంగా విద్యార్థులు ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టుకున్నారు. ఈ సందర్భంగా శ్రీవత్సవ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వివేకానంద సంస్థ వేసవి శిబిరంలో భాగంగా భగవద్గీత శ్లోకాల అధ్యయనం, పురాణ ఇతిహాసాలపై అవగాహన, శిక్షణ తరగతులు నిర్వహిస్తూ వస్తుందని, యోగా మన జీవితంలో ఒక భాగం కావాలని, యోగా ద్వారా వ్యక్తి మానసిక ప్రశాంతత, పరిపూర్ణత సాధించగలడని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, పలువురు సభ్యులు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

31వ వార్డులో..

జీవీఎంసీ 31వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ వార్డు అధ్యక్షుడు దొడ్డి బాపూ ఆనంద్ నేతృత్వంలో స్నేహితుల దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు.

వాకర్స్ క్లబ్ సేవలు భేష్



వాకర్స్ వాయిస్ పత్రికను ఆవిష్కరిస్తున్న ఆచార్య జీఎస్ఎన్‌రాజు, క్లబ్ సభ్యులు

మురళీనగర్: స్థానిక వాకర్స్ క్లబ్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య డాక్టర్ జీఎస్ఎన్ రాజు కొనియాడారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. నడక ద్వారా ఆరోగ్య పరిరక్షణకు కృషి చేయడాన్ని ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆయన వాకర్స్ వాయిస్ పత్రికను ఆవిష్కరించారు. నూతనంగా చేరిన 20 మంది సభ్యులతో డిస్ట్రిక్ట్–101 గవర్నర్ కె.ద్వారకానాథ్ ప్రమాణం చేయించారు. ఈ నెలలో పుట్టినరోజు జరుపుకుంటున్న సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ డిస్ట్రిక్ట్–101 ఆర్‌సీ–5 యు.శుభ, పూర్వ అధ్యక్షుడు ఎస్.బుచ్చయ్య, కార్యదర్శి సీహెచ్ఎస్ఎస్‌వీ ప్రసాదరావు, సహాయ కార్యదర్శి ఎన్.ప్రకాశరావు, కోశాధికారి ఆర్.నాగేశ్వరరావు, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రిటైర్డ్ రైల్వే ఉద్యోగికి సత్కారం



మోహనరావును సత్కరిస్తున్న అతిథులు

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ డీజిల్ లోకో షెడ్‌లో సీనియర్ టెక్నీషియన్‌గా విధులు నిర్వర్తించి పదవీ విరమణ చేసిన కె.మోహనరావును రైల్వే న్యూకాలనీ లెవెన్ స్టార్ అసోసియేషన్ సభ్యులు స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం ఘనంగా సత్కరించారు. రైల్వేలో సుదీర్ఘకాలం పాటు సేవలందించి రిటైరైన తమ మిత్రుడు, అసోసియేషన్ సభ్యుడు మోహనరావు శేష జీవితం ప్రశాంతంగా గడపాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నంద శ్రీనివాస్, బోని శ్రీనివాస్, శ్రీరామ్, వై.శ్రీను, పట్నాల నాగరామ్మోహనరెడ్డి, అప్పలరాజు పాల్గొన్నారు.

తత్కాల్ టికెట్ కోసం క్యూలకు చెక్

మరుసటిరోజు క్యూలో ఉంటే చాలు



దువ్వాడ రైల్వేస్టేషన్

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో తత్కాల్ టికెట్ తీసుకోవాల్సిన ప్రయాణికులు ముందురోజు రైల్వే అధికారులు ఏర్పాటు చేసిన పత్రంపై పేరు, సీరియల్ నంబర్, ఆధార్ నంబర్ రాసి తర్వాత రోజు టికెట్ కోసం క్యూలో ఉంటే సరిపోతుంది. ఈ విధానం దువ్వాడ రైల్వేస్టేషన్ అధికారులు ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైల్వే తత్కాల్ టికెట్లను ముందు రోజు జారీ చేస్తారు. వాటి కోసం అదేరోజు తెల్లవారు జాము నుంచి ప్రయాణికులు స్టేషన్ వద్ద పడిగాపులు కాస్తుంటారు. దీంతో ప్రయాణికులు తోపులాటకు దిగుతుండడంతో దువ్వాడ రైల్వే కమర్షియల్ అధికారి ఎం.ఎస్.రావు చొరవ తీసుకొని ముందురోజు రాత్రి 9.30 పది గంటల మధ్యలో అధికారికంగా ఒక పేపర్ ఏర్పాటు చేస్తున్నారు. వాటిపై పేర్లు, ఆధార్ నంబర్ రాసి పెట్టి మరుసటిరోజు ఉదయం కౌంటర్ తెరవకముందు వస్తే సీరియల్ నంబర్ ప్రకారం పిలిచి టికెట్లు జారీ చేస్తున్నారు. దీంతో ఎవరు నమోదు చేశారో వారికే టికెట్ అందుతుండడం, ఏజెంట్లు హడావుడి లేకుండా ఆర్పీఎఫ్ సహకారంతో సజావుగా టికెట్ల జారీ ప్రక్రియ సాగుతుండడంతో ప్రయాణికులు హర్షిస్తున్నారు.

మానవాళి రక్షణలో మడ అడవులు కీలకం



విద్యార్థులకు మడ అడవులు, పులుల గురించి వివరిస్తున్న సీతా శ్రీనివాస్

తాటిచెట్లపాలెం: మానవాళిని రక్షించడంలో మడ అడవుల పాత్ర కీలకమని కథా కథన శిల్పి, వాయిస్ ఆర్టిస్ట్, రికార్డిస్ట్ ఎస్. సీతా శ్రీనివాస్ అన్నారు. భారతీయ విద్యా భవన్ పబ్లిక్ స్కూల్‌తో కలిసి విశాఖ పబ్లిక్ లైబ్రరీ మియావాకీ స్టోరీటైమ్ వీకెండ్ యాక్టివిటీలో భాగంగా ఆదివారం పౌర గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జూలై 26న అంతర్జాతీయ మడ అడవుల సంరక్షణ దినోత్సవం, జూలై 29న అంతర్జాతీయ పులుల దినోత్సవం జరిగాయని, మానవ చరిత్రను రక్షించడంలో మడ అడువులు, పులుల పాత్ర ఎంతో ఉందని తెలిపారు. మడ అడవులు ప్రకృతి తీర రక్షకులుగా ఎలా తీరాలను కాపాడతాయో, నేల క్షీణతను తగ్గిస్తాయో, జలచరాలు, పక్షులకు ఆశ్రయంగా ఉంటాయో పిల్లలకు వివరించారు. ఇవి రాబోయే తరాల భద్రతకు ఎంత ముఖ్యమో తెలియజేశారు. పులి శక్తికి, పర్యావరణ సమతుల్యతకు చిహ్నంగా ఎలా ఆహార గొలుసులో కీలకపాత్ర పోషిస్తుందో, దాని సంరక్షణ ఎందుకు అవసరమో వివరించారు. పబ్లిక్ లైబ్రరీ కార్యదర్శి డి.ఎస్.వర్మ మాట్లాడుతూ మడ అడవులను సంరక్షించుకుంటే భవిష్యత్‌కు రక్షణగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నృత్య కళలను ప్రోత్సహించాలి



గజ్జె పూజ చేసిన విద్యార్థినులతో ఎం.వి.రాజశేఖర్ తదితరులు

తాటిచెట్లపాలెం: భారతీయ సంప్రదాయంలో భాగమైన నృత్య కళలను తప్పనిసరిగా ప్రోత్సహించాలని ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్ అన్నారు. శంకరమఠం ఎదురుగా గల పద్మశాలి భవన్‌లో ఆదివారం శ్రీ నటరాజ నృత్యనికేతన్ వ్యవస్థాపకుడు, నాట్యగురువు నటరాజ పరమేశ్వరన్ సారథ్యంలో విద్యార్థినులచే ఘనంగా గజ్జె పూజ చేయించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ నృత్య కళాకారులతోనే సాంస్కృతిక వైభవం కలుగుతుందన్నారు. కళాకారుల కోసం నాట్యగురువు నటరాజ పరమేశ్వరన్ చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో కె.సన్యాసిరావు, టి.వెంకటేశ్వర్లు, కె.సత్యనారాయణ, బి.పి.ఎస్.కల్యాణి, వి.కృష్ణమోహన్, విద్యార్థినులు, వారి తల్లితండ్రులు, భక్త మార్కండేయ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.